
శ్రీ వేదగిరి కమ్యూనికేషన్స్ - నవ్య వీక్లీ ఉగాది కథానికల పోటీలో
విశేష బహుమతి పొందిన కథానిక

# వటపత్రశాయి





"షీ ఈజ్ ప్రెగ్నెంట్..."

గైనకాలజిస్ట్ మాటలకు నాలోని శక్తినంతా ఎవరో తోడేసినట్టు అయిపోయాను.

"థాంక్యూ.. థాంక్యూ వెరీ మచ్" తెచ్చిపెట్టుకున్న సంతోషంతో షేక్ హేండిచ్చారు సుభాష్.

అమెరికన్ డాక్టర్ గనుక మొక్కుబడిగా చెప్పింది. ఇదే ఇండియాలో అయితే ఇదేదో మహత్తర సంగతైనట్టు "కంగ్రాట్యులేషన్స్, మీరు తల్లి కాబోతున్నారు" అని సంబరంగా చెప్తారు.

మెడికల్ సెంటర్లోంచి బయటపడి కారు వైపు మౌనంగా భారంగా అడుగులేస్తున్నాం.

"ఇండియా వెళ్లినప్పుడు ఖాళీ లేకుండా పెళ్ళిళ్ళకీ పుణ్యతీర్థాలకీ తిరిగేం. కాస్తంత కేర్ తీసుకునుంటే ఇలాంటి పరిస్థితి వచ్చేది కాదు" కించిత్తు నిష్టూరంగా అన్నాను సుభాష్‌తో.

"ఇంకో ఒన్ ఇయర్ దాకా చిల్డ్రన్ వద్దు. లెటజ్ స్టిక్ టు దట్" కారెక్కుతూ అన్నారు.

శరీరం ఆసాంతం సన్నగా కంపిస్తోంటే మౌనంగా ఉండిపోయాను.

కారు వేగంగా డ్రైవ్ చేస్తున్నాడు సుభాష్.

నాకు రోడ్డేకాదు పరిసరాలూ కన్పించడం లేదు. మనసంతా గందరగోళంగా ఉంది.

"లెటజ్ గో ఫర్ అబార్షన్..." చూపులు మరల్చకుండా అన్నారు.

నేనాశించిన సమాధానం అదే. అయినా ఉల్కి పడ్డాను. భయంగా చూశాను. నోటి తడారి పోతోంటే "ఫస్ట్ ఇష్యూ..... మంచిదేనా?" అన్నాను.

"యాఁ ప్రాక్టికల్‌గా ఆలోచించు. లక్కీగా నీకు ఒన్ ఇయర్ ప్రాజెక్టు వచ్చింది..... దీని కోసం చూస్తే దానికి మధ్యలోనే గుడ్ బై చెప్పాలి..... మూణ్ణెల్లకన్నా ఎక్కువ ఖాళీగా వుంటే హెచ్‌ఒన్‌బీకి ప్రోబ్లం వస్తుంది. వెంటనే ఇంకో ప్రాజెక్టు రాకపోతే హెచ్‌ఫోర్‌కి మారాలి. ప్రస్తుత పరిస్థితుల్లో మళ్ళీ హెచ్‌ఒన్ బీ రావడం చాలా కష్టం. సో.... బేబీ కోసం చూసుకుంటే మళ్ళీ జాబ్ చేసే అవకాశం రాకపోవచ్చు. సెవెంటీ థౌజండ్ డాలర్స్ లాస్...!"

"పాయింటే. ఇన్సూరెన్సు ప్రీమియమూ ఎక్కువ పే చేయాలి. డెలివరీ చార్జెస్ ఎక్స్‌ట్రాగా చాలా అవుతుంది. నీకు గుర్తుందిగా. రామ్‌గారి వైఫ్ డెలివరీకి ఇన్సూరెన్స్ మనీ గాక ఎయిట్ థౌజండ్ ఎడిషనల్ ఖర్చయింది. అలాంటిది జరిగితే మన బ్యాంక్ బ్యాలెన్స్ బాగా కరిగిపోతుంది....."

"యా.... అదీగాక డెలివరీకి మీ పేరెంట్స్‌ని పిలవాలి... టూ బెడ్ రూం పోర్షన్ తీసుకోవాలి.....!"

"అంతా ఎక్స్‌పెండిచరే!"

"దట్ సీమ్స్ బెటర్ ఆప్షన్. పొరబాటున కూడా మీ వాళ్ళకి గాని మా వాళ్ళకి గాని తెలీనివ్వకు. ఒట్టి సెంటిమెంటల్ ఫూల్స్!"

"రోజూ మమ్మీ అడిగే మొదటి ప్రశ్న 'ఏదైనా విశేషం వుందా'-అనే. ఆంటీ కొంచెం పాలిష్‌డ్‌గా అడుగుతారు. 'పెళ్లై రెండేళ్ళయ్యిందిగా, ఇంక ప్లానింగ్ మానెయ్యండీ' -అంటారు"

"మెడ నిండితే చాలు ఒడి నిండాలంటారు. ఏమిటో చాదస్తాలు!"

"మనీ వాల్యూ మెటీరియలిస్టిక్ ప్లెజర్స్ వారికి తెలీదులే!"

"లీవిట్.... నెక్స్ట్ వీక్ అబార్షన్‌కి ప్లాన్ చేద్దాం. మళ్ళీ ఫ్రీ బర్డ్స్ అయిపోదాం"

"ఇట్స్ ఫైన్..... సుభాష్.... కృష్ణా టెంపుల్ ఈ ప్రక్కనే కదా. ఓ సారటు వెళ్లి ఇంటి కెళ్దాం"

నవ్వేరు. "పాపభీతా?"

"అహహ.... ఎలాగూ ఇటుకేసి వచ్చాం కదా. టెంపుల్ కెళ్ళి చాన్నాళ్ళయింది....."

కారు పార్కు చేసి గుళ్ళోకెళ్ళాం. వీకెండ్ కాకపోవడంతో జనం లేరు. హారతి తీసుకుని వచ్చి హాల్లో కూర్చున్నాం.

"ఈ మధ్య రావటం లేదేం" అంటూ మా పద్దకు వచ్చారు పూజారి శర్మగారు. మాదీ ఆయన్దీ హైదరాబాదే.

"ఇండియా వెళ్ళాం....."

"మేమూ వెళ్ళిరావాలి. మనవడు పుట్టాడు. త్వరగా వెళ్ళి చూడాలని చాలా ఆత్రంగా ఉంది"

"నిత్యం భగవంతుడి సన్నిధిలో వుండే మీక్కూడా.....!" కళ్ళతో నవ్వేరు సుభాష్.

మందహాసం చేశారాయన. "భగవద్గీత బోధ అయ్యాక అర్జునుడేమన్నాడో తెలుసా? తన అజ్ఞానమోహాంధకారం నశించిందన్నాడు. ఆ తర్వాత అదే అర్జునుడు కొడుకు అభిమన్యుడి మరణ వార్త విని ఎంతగానో శోకించాడు. ఎంచేతంటారు?"

ఇద్దరం ఇబ్బందిగా చూశాం.

"పుత్ర వాత్సల్యం అంత బలీయమైంది గనుక" అన్నాను.

"గీతాసారం ఒంట బట్టకేమో అనుకుంటున్నాను" సుభాష్ అన్నారు.

"మీకింకా సంతానం కలగలేదు కదూ? కలిగేక తెలుస్తుందిలే"

సంభాషణ నచ్చక చటుక్కున లేచాను "వెళ్ళొస్తాం శర్మగారూ"

ఎవరో తరుముతున్నట్టు కారు వైపు నడిచాను.

"వాట్ హేపెన్డ్ దివ్యా. ఆయనేదో అంటే నువ్వింకేదో అయిపోయావేంటి?"

"ఏదో అనీజీగా వుంది....."

"ఎందుకని?"

"చెప్పలేను"

"చైల్డిష్‌గా బిహేవ్ చెయ్యకు..."

ఆ రాత్రి సుభాష్ రోజూలానే గురకపెట్టి నిద్రపోయారు. కాని నాకు నిద్ర రాలేదు. ఎప్పుడైనా కాస్త నిద్ర తూలితే ఏదో చిన్న మూలుగు విన్పించినట్టూ, గుండెకింద సన్నని సెగ పెట్టినట్టూ అన్పిస్తోంది. దాంతో మరి నిద్ర దరి చేరలేదు.

ఉదయమే మమ్మీ ఫోన్ చేసింది. మ్యాజిక్ జాక్‌తో రోజూ చేస్తూంటారు.

"నీ మాట నీరసంగా వుందేవిటే. ఒంట్లో బాగానే వుంది కదా?!"

"రాత్రి మూవీ చూశాంలే" ఆవులిస్తూ అన్నాను.

డాడీ లైన్లోకొచ్చారు. "రాత్రి నాకో కల వచ్చింది చిట్టి తల్లీ. నీ కడుపున బాలకృష్ణుడు పడినట్టు...!"

"వ్వాట్?" బిగ్గరగా అరిచాను.

"ఏమిటలా అరిచావు తల్లీ....."

"అహ. ఏం లేదు.... కల ఏంటీ.... మళ్ళీ చెప్పండి డాడీ....."

"బాలకృష్ణుడు నీ కడుపున పుట్టబోతున్నట్టు....!"

"భలే వారు డాడీ..... గీతోపన్యాసాలకి వెళ్తున్నారుగా. అందుకని అలా అన్పించి వుంటుంది"

"ఏమో మరి. భగవంతుడి లీల మనకి తేలిగ్గా అర్థం కాదులే తల్లీ. నీకు ఒంట్లో కులాసాగా వుంది కదా?"

"ఆఁ.. ... ఓకే డాడీ.... సాయంత్రం మట్లాడుకుందాం....."

కంగారుగా ఫోన్ పెట్టేశాను.

"ఇందాకేవిటలా అరిచావ్ డార్లింగ్" బ్రష్ చేసుకుంటూ బాత్‌రూంలోంచి తొంగి చూస్తూ అడిగారు సుభాష్.

"డాడీకేదో పిచ్చికల వచ్చిందట"

"నీకు నెల తప్పినట్టా!"

తలాడించాను.

"వాళ్ళకా ట్రాష్ తప్ప ఇంకేం అక్కర్లేదు"

నవ్వబోయాను గాని పెదాలు విడివడ్లేదు. వంట చేయాలన్పించ లేదు. కూర్చుండి పోయాను.

"డల్‌గా ఉన్నావేంటి. మీ వాళ్ళేమైనా అన్నారా?"

"అహ..... నాకేమిటో గిల్టీగా వుంది..... అబార్షన్ సంగతి ఇంకో వీక్ వాయిదా వేద్దాం సుభాష్"

నా వంక చిత్రంగా చూశారు. భుజాలు ష్రగ్ చేస్తూ, "యాజ్ యూ విష్" అన్నారు.

గుండెల్లో సంతోష తరంగం లేచి పడింది. గబుక్కున ఆయన్ని ముద్దు పెట్టుకున్నాను.

స్నానం చేస్తూ పొట్ట కింది భాగాన్ని స్పృశించాను.

ఇదిగో ఇక్కడే ఈచిన్ని పొట్టలోనే ఓ జీవి ఊపిరి పోసుకుని పెరుగుతోంది! నాలో ఇంకో బుల్లిప్రాణి! నూతన సృష్టి! మా ప్రేమఫలం! మా ఇద్దరి రక్తాన్నీ మా ఇరువురి పూర్వుల జీన్స్‌నీ సంతరించుకుని రూపు దిద్దుకుంటున్న చిన్నారి!

నిజంగా గర్భధారణ ఓ అద్భుతాను భూతే!

నా శరీరంలోని అణువణువులోనూ ఏదో వింత భావన! మరేదో క్రొంగొత్త అనుభూతి!

బాత్‌రూం తలుపు తట్టారు. "ఎంతసేపు? జాబ్‌కి లేటవుతాం"

"వచ్చేస్తున్నా....."

ఆదరాబాదరా స్నానించి బయటపడ్డా.

బ్రేక్‌ఫాస్ట్ చేస్తూ సుభాష్ నా వంక తేరపారి చూస్తోంటే నాకేవిటో సిగ్గుగా అన్పించింది. ఇదీ కొత్త ఫీలింగే!

వారం రోజులు గడిచాయి. సుభాష్ ఆ ఊసు తేవాలని చాలా సార్లు ప్రయత్నించారు. నాకది రుచించక ఏవో వంకలు పెట్టి సున్నితంగా సంభాషణ దాట వేశాను.

"నీలో చాలా ఛేంజ్ కన్పిస్తోంది..." డిన్నర్ చేస్తోంటే అన్నారు.

నా బుగ్గలు గులాబీ రంగుని దిద్దుకున్నాయి. కనురెప్పలు బరువెక్కాయి. ఒళ్ళు దూది కన్నా తేలికై గాలిలో తేలిపోసాగింది!

"హే! వాటీజ్ హ్యాపెనింగ్ టు యూ!"

"ఏదో మార్పు నాకు కూడా క్లియర్‌గా తెలుస్తోంది. శరీరంలో మనస్సులో ఆలోచనల్లో అనుభూతుల్లో అన్నిటా—లైఫ్‌లో ఎన్నడూ చూడని వింత భావనలు! విచిత్ర అనుభూతులు!"

అతడి నుదురు ముడివడింది. "నువ్వు నువ్వేనా అన్పిస్తోంది"

"కాదు. దివ్యస్త్రీని" కిలకిలా నవ్వాను. "ఒక్కర్ని కాదు ఇద్దర్ని. ఆడబ్రహ్మని!"

అరచేత్తో నుదురు చిన్నగా కొట్టుకున్నారు.

"నీ పాజిబిలిటీ థింకింగ్, లాటరల్ థింకింగ్, రియాల్టీ అప్రోచ్ అన్నీ ఏమై పోయాయి?"

"పాజిటివ్ థింకింగ్ ప్రవాహంలో కొట్టుకుపోయాయి"

"చూస్తోంటే అలాగే ఉంది. ఫైనాన్షియల్ ఇంప్లికేషన్స్ ఆలోచించకుండా ఆర్డనరీ లేడీలాగా సిల్లీగా ఆలోచిస్తావేంటి దివ్యా. ఇటీజ్ టూ మచ్. కలలొద్దు. నేలమీదకి దిగిరా"

"ఒక్కటి చెప్పు. నాలుగేళ్ళ నుంచి అమెరికా నీళ్ళు త్రాగుతూ ఇక్కడి వారిలా మనమూ మెటీరియలిస్టులం అయిపోలేదు కదా?"

"అయితే తప్పేముంది? డాలర్ కనుసన్నల్లో నడుస్తోంది హెూల్ వరల్డ్!"

"అఫ్‌కోర్స్... కాని డాలర్ల కోసం పరుగులెడుతూ చాలా మిస్సవుతామన్పిస్తోంది"

"లెటిట్ బీ"

"ఇండియాలోనూ మనకి గొప్ప అవకాశాలొచ్చాయి. అవి కాదని ఒక డ్రీమ్‌తో ఇక్కడి కొచ్చాం. బాగానే సంపాదించాం. త్రీ ఫోర్త్ అమెరికా చూశాం. ఎంతో ఆనందంగా ఉన్నాం. ఇక నాణానికి రెండో వైపు చూద్దాం. అయిన వాళ్లకి దూరంగా వచ్చేశాం. పెళ్ళిళ్ళూ పండగలూ మిస్సవుతున్నాం. అభిమానాలకీ ఆప్యాయతలకీ దూరమయ్యాం. మన సుఖాలు మన ఆనందాలు మనకే పరిమితమైపోయాయి. ఏవీ ఎవర్తోనూ పంచుకోలేక పోతున్నాం. ఇక్కడే ఇలాగే ఉంటే లైఫ్‌లో థ్రిల్ ఉండదేమో? మొనాటనీ మనల్ని మింగేస్తుందేమో...?!"

"ఈ డొంక తిరుగుడెందుకు? చెప్పదలిచింది సూటిగా చెప్పు. కించిత్తు కోపంగా అన్నారు.

"లెటజ్ కీప్ ది బేబీ!"

సూటిగా నా మొఖంలోకి చూశారు. విసురుగా లేచి వెళ్ళి చేతులు వాష్ చేసుకున్నారు.

"ప్లీజ్ సుభాష్! థింక్ ఎగైన్. ఈ డాలర్లూ ఈ భౌతిక సుఖాలూ కొంతవరకూ మాత్రమే తృప్తినిస్తాయి. ఆ తర్వాతంతా నిస్సారంగా నిస్తేజంగా..... అపురూపమైంది పోగొట్టుకుని దురదృష్టవంతులుగా మిగిలిపోతామేమో!" నా కళ్లకు కన్నీటి పొర అడ్డొచ్చింది.

"ఏయ్ పిచ్చీ. నేనేం నో చెప్పట్లేదు. జస్ట్ పోస్ట్‌పోన్ చేద్దామంటున్నాను"

"చేతిలోది చేజార్చుకుని ఇంకో దానికోసం ఎందుకు ఎదురు చూడాలి చెప్పు? ఈ తొలి అనుభవాన్నే గుండెలకి హత్తుకుందాం. అమెరికన్ మెంటాలిటీతో గాక ఇండియన్ సంస్కృతీ దృక్పథాలతో ముందుకడుగేద్దాం. ఆడజన్మ సార్థకత మాతృత్వంలో వుందంటారు. మానవజన్మ పరిపూర్ణత కొత్త సృష్టిలోనే వుందంటారు. మొన్నేదో బుక్‌లో చదివాను. సంతానం కలిగితేనే మాతాపితల ఋణం తీరుతుందట!"

"షటప్. నువ్వు కూడా అలాంటి ట్రాష్ మాట్లాడతావనుకోలేదు!"

"నేనే కాదు నా రక్తమూ ఇండియనే కదా!" మందహాసం చేశాను.

చిర్రెత్తు కొచ్చినట్టుంది విసురుగా గదిలోకి వెళ్ళిపోయారు. కాస్సేపలా ఒంటరిగా వదలటమే మంచిదన్పించింది.

అతడన్నట్టు నా దృక్పథంలో చాలా మార్పు వచ్చిన మాట నిజమే. ఇది వరకు బ్యాంక్ బాలన్స్ గురించీ కొనాల్సిన ఆస్తిపాస్తుల గురించీ మాత్రమే మాట్లాడేదాన్ని. ఇప్పుడు థౌజండ్సాఫ్ డాలర్స్ ఎడంచేత్తో తోసెయ్యడానికి సిద్ధపడుతున్నానంటే..... రియల్లీ మాతృత్వపు మహత్తు ఇంత శక్తివంతమైందా?

జాబ్ ప్లేస్‌లో చాలా కళ్ళు నావంక ఆసక్తిగా చూశాయి. ముసిముసిగానూ నవ్వాయి.

"యూ లుక్స్ గ్రేస్‌ఫుల్! ట్రైంఫెంట్!" అంది జెన్నీ.

నా రక్తమంతా ఆనందోత్సాహాలుగా మారిపోయిన అనుభూతి!

నాకు నేనే కొత్తగా అనుభూతిస్తూ రెస్ట్‌రూంలోకెళ్ళినప్పుడల్లా క్రింది పొట్టని ఆప్యాయంగా నిమురుతూ.....!

నాలుగైదు రోజులకి సుభాష్ కొంచెంగా మెత్తబడ్డారు. కాని బయటపళ్ళేదు.

"మన వాళ్ళకి సూచాయిగా చెబుతాను..... వాళ్ళ రియాక్షనెలా వుంటుందో చూద్దాం" మెల్లగా అన్నాను.

అడ్డు చెప్ప లేదు. వెంటనే మమ్మీకి కాల్ చేశాను.

"జస్ట్ అనుమానం, ఇంకా డాక్టర్ని కలవలేదు" అని చెప్పినా సరే విన్పించుకోకుండా ఎంతో సంబరపడి పోయి జాగ్రత్తలు చెప్పెయ్యసాగింది మమ్మీ.

"థర్డ్ మంత్ కదూ? థాంక్ గాడ్... నాకు కల వచ్చినప్పుడే... గాడ్డీజ్ గ్రేట్" అన్నారు డాడీ ఆశ్చర్యానందాలతో.

ఆంటీ స్వీట్సు పంచేస్తానంటూ హడావిడి చేస్తే, "మాకు బేబీగాళ్ కావాలి. మేమే పెంచుతాం. ఎడ్వాన్స్ బుకింగ్" అన్నారు అంకుల్.

వారి మాటలకు చేష్టలకు ఏదో అపురూపమైంది దక్కినట్టు లైఫ్‌లో ప్రమోషన్ వచ్చినట్టూ వుంది!

"ఓకే. లెటజ్ హేవ్ దిస్ బేబీ..." నన్ను దగ్గరకి తీసుకుని పొట్టని సున్నితంగా టచ్ చేస్తూ అన్నారు.

"థాంక్యూ థాంక్యూ....." గాఢంగా ముద్దాడాను. బార్బీ బొమ్మ లభించిన చిన్న పిల్లలా పొంగిపోయాను.

మంత్రించినట్టుగా మా ఆలోచనలు, ధోరణులు, అభిప్రాయాలు ఊహలు-అన్నీ మారిపోయాయి.

సుభాష్ ఇంత పొస్సెస్సివ్‌గా వుంటారని కలలో కూడా అనుకోలేదు.

కార్పెట్ క్లీనింగ్ వగైరాలు ఇది వరకే చేసేవారు. ఇప్పుడు అదనంగా వంటలో సాయం రావడమే గాక బాత్‌రూం క్లీనింగ్ కూడా తనే చేస్తున్నారు. బరువు పనులేవీ నన్ను చెయ్యనివ్వట్లేదు. ఆఖరికి వాల్‌మార్ట్‌లో కొన్న ప్రొవిజన్స్ కారులోంచి కూడా తనే ఫ్లాట్‌లోకి మోసుకొస్తున్నారు. ప్రెగ్నెంట్స్‌కు సంబంధించిన సైట్స్ సెర్చి చేసి ఎన్నో జాగ్రత్తలు చెబుతున్నారు.

స్కానింగులో బేబీ బోయ్ అని చెప్పారు. దాని కన్నా కూడా బిడ్డ ఎదుగుదల సక్రమంగా వుందని తెలిసి ఎక్కువ సంతోషపడ్డాం. మమ్మీ డాడీ పొంగిపోయారు. అమ్మాయిల్లేనందున మనవరాలు కావాలని ఆశిస్తున్న ఆంటీ అంకులూ కొంచెం నిరాశ పడ్డారు. కాని వెంటనే సర్దుకుని "వంశోద్ధారకుడికి స్వాగతం" అనేశారు.

ఒక్కో నెలా గడిచే కొద్దీ నాలో ఎన్నో ఎన్నో మార్పులు!.

మధురానుభూతులూ తీయని కలలూ - నా చుట్టూ కొత్తలోకాన్ని పరుస్తున్నాయి. క్రొంగొత్త భావనల్ని పరిచయం చేస్తున్నాయి. బిడ్డ ప్రతి కదలిక తెలుస్తోంది. పరవశానికి అర్థమూ తెలుస్తోంది. ఆసుపత్రిలో బాబు గుండె చప్పుడు విన్పించి సంభ్రమంలో ముంచారు డాక్టర్లు!

నిజంగా నాలో ఓ చిన్నారి జీవి పెరుగుతోందా! ఇంకా నమ్మశక్యం కావట్లేదు!

"సీమంతం చేస్తాం ఇండియా రండి" అన్నారు ఆంటీ అంకుల్. మాకు లీవు దొరకదని చెప్పాము.

"అయితే మేం అమెరికా వచ్చి ఆ ముచ్చట తీర్చి పురుడు పోసి వస్తాం" అంటూ వచ్చారు మమ్మీ డాడీ.

స్థానిక మిత్రుల్నీ సమీప ప్రదేశాల్లోని బంధువుల్నీ ఆహ్వానించి బేబీ షోవర్ చాలా సరదాగా చక్కగా అరేంజ్ చేశారు సుభాష్. బుడగల దగ్గర్నుంచి లంచ్ వరకూ బ్యాంగిల్స్ నుండి కేక్ వరకూ ప్రతి చిన్న విషయానికీ ఎంతో శ్రద్ధ తీసుకుని చక్కగా లవ్లీగా అరేంజ్ చేశారు.

"ఇదంతా అవసరమా?"

"నేను డాడీ కాబోతున్నానోయ్. ఇక కేరింతలు కిలకిల నవ్వులు మనింట్లో ప్రతిధ్వనిస్తాయ్" కించిత్తు గర్వంగా చెప్పారు.

ఆయన్లోని మార్పుకి పరమానందపడ్డాను.

అంకుల్ ఫ్లెక్సీ మీద నా ఫొటోని ప్రింట్ చేయించి దాని మీద 'క్రౌనింగ్ ది మదర్‌హుడ్' అని రాయించి కొరియర్లో పంపించారు.

బ్యూటీ క్వీన్‌కి పెట్టినట్టు పూలకిరీటం పెట్టి మెడలో క్లాత్ వేసి నన్ను నిజంగా మాతృత్వపు రాణిని చేసి అందలం ఎక్కించారు.

అందరి అభినందనలూ అందుకున్నాను. సీమంతం కొత్త ఉత్సాహాన్నిచ్చింది. నూతనోత్తేజం నన్ను నిలవనీయట్లేదు!

ఇద్దరం ఇడిడి. కోసం ఆత్రంగా ఎదురు చూస్తున్నాం.

"యూ లుక్ వెరీ చీర్ ఫుల్ అండ్ కాన్ఫిడెంట్!" చెకప్ కెళ్ళగా అంది డాక్టర్.

"మమ్మీ డాడీ కేమ్ ఫ్రమ్ ఇండియా టు లుకాఫ్టర్ మీ"

"గ్రేట్! పేరెంట్స్ విల్ స్టాండ్ బై యువర్ సైడ్ ఇనెవరి ఇంపార్టెంట్ స్టెప్. ఉయ్ హేవ్ టు లెర్న్ లాట్ ఫ్రమ్ యువర్ ఫామిలీ సిస్టం!"

"భారతీయులుగా పుట్టినందుకు గర్విస్తున్నాను.." చిన్నప్పుడు స్కూల్లో చేసిన ప్రతిజ్ఞ మెదడులో మెదిలింది. ఏనుగెక్కినంత సంబరుపడ్డాను.

డెలివరీ రావచ్చన్న జనవరి 30 వచ్చేసింది. మనస్సంతో ఉత్కంఠ భరితమై ఊగిపోతోంది. ఆరాటం, అలజడి, బెరుకు, భయం ఒకేసారి విభిన్న భావాల సమ్మేళనం!

ఎంచేతో నొప్పులు మొదలు కాలేదు.

ఎంత చిత్రం! తలనొప్పి, కడుపు నొప్పి, కాలు నొప్పి – ప్రతీ నొప్పీ త్వరగా పోవాలను కుంటాం. కాని పురుటి నొప్పులు రావాలని ఎదురు చూస్తాం!

డాక్టర్ చెకప్ చేసి "ఎవ్విరిథింగ్ నార్మల్" అన్నారు. మర్నాటి సాయంత్రం దాకా వెయిట్ చేద్దామనీ ఆలోగా పెయిన్స్ రాకపోతే వచ్చి అడ్మిట్ కమ్మన్నారు.

మర్నాడూ పెయిన్స్ రాలేదు. అందర్లోనూ ఏదో తెలీని ఆందోళన, భయం!

"లెట్ హిమ్ చూజ్ హిజ్ బర్త్ టైం" అన్నారు అంకుల్. "అమ్మ కడుపులో హాయిగా వెచ్చగా వుందేమో. వదలి రాబుద్ధి కావడం లేదేమో" అనీ అన్నారు.

ఆసుపత్రిలో చేరడానికి బయల్దేరుతోంటే చిత్రంగా పెయిన్స్ మొదలయ్యాయి. ఉత్సాహం వరదై పొంగింది.

అర్ధరాత్రి దాకా ఆగి ఆగి నొప్పులు రాసాగాయి. భరించలేక కేకలు పెట్టాను. అంతకంతకీ శక్తి సన్నగిల్లుతోంది.

కడుపులోని బిడ్డ తలక్రింద చేయిపెట్టుకుని పవ్వళించివున్నాట్ట!

ఇది రేర్ పోశ్చర్ అనీ డెలివరీ కొంచెం కష్టం అవుతుందనీ చెప్పారు. నాలో భయాందోళనలు తారస్థాయికి చేరుకున్నాయి. అవసరమైతే వాక్యూమ్ పరికరాన్ని ఉపయోగిస్తామని చెప్పినా సంబాళించుకోలేకపోతున్నాను.

నాకేదో అయిపోతుందన్న భయాల భూతాలు నామీద పడి నిర్దాక్షిణ్యంగా పీక్కు తినసాగాయి!

సుభాష్ నాకు ధైర్యం చెప్పడానికి నా పక్కనే ఉన్నారు. అమెరికాలో ఒకర్ని ఎలవ్ చేస్తారు. డెలివరీ టైంలో భర్త దగ్గరుంటే భార్యకి భరోసా. భార్య కష్టం భర్తకీ తెలుస్తుంది.

నా నొప్పుల బాధ ప్రసవ వేదన చూసి కళ్ళనీళ్ళు పెట్టుకున్నారు. నేను గ్రుగులవుతోంటే నిస్సహాయంగా చూశారు. నేను ఓర్చుకోలేక పెట్టిన కేకలకి బెంబేలు పడ్డారు.

"సిజేరియన్ చేసెయ్యండి ప్లీజ్..." అర్థించారు. అవసరమైతే తప్ప అక్కడి డాక్టర్లలా చెయ్యరని తెలిసి కూడా.

ఆ స్థితిలోనూ ఆ కేకల్ని రికార్డు చేసి విన్పిస్తే ఏ కొడుకూ జన్మలో తల్లిని నిర్లక్ష్యం చెయ్యడన్న ఊహ నాలో మెదిలింది.

నొప్పులు అధికమయ్యాయి.

"నేనిక భరించలేను.... చచ్చిపోతున్నాను... దేవుడా చంపెయ్... భరించలేను... ఏదోటి చెయ్యండి బాబోయ్... ఈ నరకం నాకొద్దు... వద్దు...నాకెవరూ వద్దు... ఏమీ వద్దు... చచ్చిపోతాను.. అదిగో మహా సముద్రం పొంగుతోంది. ప్రళయం... మహా ప్రళయం.. అన్నీ అంతా మునిగిపోతున్నాయి.. ఏమీ ఎవరూ మిగల్టం లేదు పోనీ అంతా పోనీ... అరె .. ఆకు మీద తేలుతూ బొటన వేలు చీకుతూ బాల శ్రీమన్నారాయణుడు నా వంకే చూస్తూ నా వైపే... వస్తున్నాడు...! ఛా అంతా భావన...వద్దు. నాకీ బ్రతుకు వద్దే వద్దు..."

ఏడ్చాను. పెడ బొబ్బలు పెట్టాను. ప్రసూతివైరాగ్యాంతో ఊగిపోయాను.

ఎపిడ్యూరల్ అనీస్థియా – కాన్పు మత్తు ఇచ్చారు. పుష్ పుష్ అని అరుస్తున్నారు. ఏదేదో చేస్తున్నారు. అతి కష్టం మీద ప్రసవం అయ్యింది. బాబు భూమ్మీద పడ్డాడు. ఒకరకమైన అపస్మారక స్థితిలో ఉన్నా ఎంతో రిలీఫ్‌గా అన్పించింది.

తెలివి వచ్చింది. చిత్రాతి చిత్రం. బ్రతికే ఉన్నాను. ప్రళయం నన్ను ముంచెత్తినా బ్రతికాను. మృత్యువుని జయించి మరో జన్మ ఎత్తాను. వెర్రి సంబరంతో ఊగిపోయాను. తెలతెల వారుతుండగా ఫిబ్రవరి ఒకటి ఉదయం ఆరూ నలభై రెండుకి మా ఇంట భానోదయమయిందన్నారు.

బాబు ఏడ్పు తప్ప ఏమీ విన్పించట్లేదు. కేర్ కేర్ మంటున్నాడు. అమ్మ కడుపు వెచ్చదనం సుఖం భద్రత బయట లేవేమో!

శిశుజననం ఎంత అద్భుతం! 'సృష్టి' ఎంత కష్టం!

మత్తు తెరల్ని చీల్చుకుంటూ నా సృష్టి వంక ఆనందోద్వేగంతో చూశాను.

గుక్కపెట్టి ఏడుస్తోన్న నా చిన్నారి పొన్నారి బంగారు కొండ–నాలోని భాగం–చూసి కష్టం బాధ, దుఃఖం, నరక యాతన, వైరాగ్యం సమస్తం మరచిపోయాను!

సుభాష్ గంతులేశారు. మమ్మీ డాడీ సరే సరి.

అచ్చం అంకుల్‌లా ఉన్నారంటూ హడావిడి చేస్తోంటే సరిగ్గా ఆంటీ ఫోన్ చేశారు. తీయని కబురు చెప్పాము. అభినందనలతో ముంచెత్తారు!

"బాబు గర్భంలో తలక్రింద చేయి పెట్టుకునున్నాడా? ప్రతి బిడ్డా భగవంతుడి అంశ అని చాటి చెబుతున్నాడన్నమాట. తామరాకు మీది నీటిబొట్టులా మనిషి ఈ ప్రపంచంలో ఉన్నంత వరకూ దేవుడే. స్వార్థపు వూబిలో దిగబడేకే దైవత్వం కోల్పోతాడు....." ఫోన్లో అన్నారు అంకుల్.

"ముందు మీ మనవడికి మంచి పేరు పెట్టండి"

"ఏ పేరు పెట్టుకున్నా ప్రతిబిడ్డా వటపత్రశాయే! ప్రతి తల్లీ జగన్మాతే!"

**(నవ్య వార పత్రిక 20.7.2011)**